



హర్..ఘర్ తిరంగా..

దేశ పతాకపు.. జాతిపతాకపు చెప్పర జైహింద్.. అందరి గుండెల వందేమాతర గీతం జైహింద్ అంటూ జనం వీధుల్లో కలియ తిరిగారు.. అందరిలోనూ దేశభక్తిని రగిలించారు.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆదివారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఊరువాడా ఘనంగా నిర్వహించారు.. ఒక్కొక్కరుగా జాతీయ జెండాలతో జత కలిశారు.. వందేమాతరం వందేమాతరం అంటూ నినదించారు.. అనపర్తిలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.. కొవ్వూరులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కినాగేంద్ర జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ చేశారు. మండల కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ హర్ ఘర్ తిరంగా నిర్వహించారు. 8

చిత్రం.. విచిత్రం!



ప్రోగ్రామ్‌కు తగినట్టు అలంకరణలు చేసేస్తున్నారు.. అలరిస్తున్నారు.. శ్రావణ మాసంలో ముత్తయిదువులదే ప్రత్యేక స్థానం.. ఇలాగే చాగల్లులో ఆదివారం ఒక ప్రత్యేక వాహనం చక్కర్లు కొట్టింది.. వాహనంపై బొమ్మ ముత్తయిదువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ధనలక్ష్మి అమ్మవారిని ఊరేగించారు.

నేడు జాబ్ మేళా

రాజమహేంద్రవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని మోడల్ కేరీర్ సెంటర్ ప్రాంగణంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి హెచ్.హరీశ్ చంద్ర ప్రసాద్ తెలిపారు. ఇన్నోవా సోర్స్, ఎస్‌బీఐ పేమెంట్, నవత, ఆపాక్ ఫైనాన్సియల్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు.ఆసక్తి కలిగిన వారు https://tinyurl.com/jf1may25 వెబ్‌సైటులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.ఆ రోజు ఉదయం 10 గంటలకల్లా హాజరు కావాలని, వివరాలకు 95332 21189 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమం ఈ నెల 11వ తేదీ సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ అర్జీలను డివిజన్, మండల కేంద్రాల కార్యాలయాల్లోనే సమర్పించవచ్చన్నారు. జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగా అధికారులు సేవలు అందిస్తారన్నారు. ప్రజలు మీ కోసం 1100 కాల్ సెంటర్ ద్వారా కొత్త ఫిర్యాదులు నమోదు చేయడంతో పాటు ఇప్పటికే నమోదైన ఫిర్యాదుల పరిష్కారస్థితిని తెలుసుకోవచ్చన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా కూడా పౌర సేవలు పొందవచ్చన్నారు.

8

950 కేజీల రేషన్ బియ్యం పట్టివేత



బొమ్మూరు ఎస్పీ కార్యాలయ ఆవరణలో వాహనాలు

తహశీల్దార్ పాత జీపు

చెత్తగించవలెను!

ప్రభుత్వ ఆఫీసుల్లో కానరాని స్వచ్ఛభారత్

మాట్లాడితే స్వచ్ఛ భారత్ అంటున్నారు.. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండాలంటున్నారు అధికారులు..అయితే వారి చుట్టూ ఉన్న పరిసరాలను మాత్రం గాలికొదిలేస్తున్నారు.. జిల్లాలో ఏ రెవెన్యూ కార్యాలయం చూసినా.. ఏ పోలీస్ స్టేషన్ చూసినా.. ఏ ఆసుపత్రి చూసినా.. ఏ చిన్న ప్రభుత్వ కార్యాలయం చూసినా పాడైపోయిన వాహనాలు, విరిగిన కుర్చీలు, భారీగా పేరుకుపోయిన ఫైళ్లు దర్శనమిస్తున్నాయి.. అయినా ఏ ఒక్కరూ వాటిపై దృష్టి సారించడంలేదు.. అధికారులు ఇకనైనా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పనికిరాని చెత్తను తొలగించి స్వచ్ఛ భారత్ చేపట్టాల్సి ఉంది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంట గెలిచి రచ్చ గెలవాలనేది సామెత. స్వచ్ఛ భారత్ క్రతువులో ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల తీరు దానికి విభిన్నంగా గోచరిస్తున్నాయి. స్వచ్ఛభారత్ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్నాయి.అయితే ప్రభుత్వ కార్యాలయాలు,పోలీస్ స్టేషన్లలో పేరుకుపోయిన చెత్తను మాత్రం వదిలించుకోవడం లేదు. స్వచ్ఛ భారత్ అంటూ మైక్‌లలో ఊదరగొడుతున్న యంత్రాంగం.. పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యర్థాల తొలగింపుపై మాత్రం దృష్టి సారించకపోవడంతో ఊరు ఊడుస్తూ ఇంట్లో చెత్త పెట్టుకున్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది.

పోలీస్ స్టేషన్ల చుట్టూ వాహనాలే..

పోలీస్ స్టేషన్లలోని వాహనాల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. తూర్పుగోదావరి జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లు ఉంటే ఏ స్టేషన్ వద్ద చూసినా సుమారుగా 400 పైనే ద్విచక్రవాహనాలు,కార్లు, లారీలు తుప్పు పట్టి దర్శనమిస్తాయి.అంటే ఒక్క జిల్లాలోనే 10 వేల వరకూ వాహనాలు మూల నపడి ఉన్నాయి. అందుకే ఏ పోలీస్ స్టేషన్‌లో చూసినా ఆవరణ నిండా ద్విచక్ర వాహనాలే దర్శనమిస్తాయి. సారా, గంజాయి, డ్రంకెన్ డ్రైవ్ తదితర కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహ నాలను తెచ్చి స్టేషన్లలో పడేస్తున్నారు. వాటిని విడిపించుకునే మార్గాలు యజమానులకు తెలియక వదిలేస్తున్నారు. దీంతో వాహనాలు తుప్పపట్టిపోతున్నాయి.పలు స్టేషన్లలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి అసలు రికార్డు నిర్వహించడం లేదని తెలుస్తోంది. ఏళ్ల పాటు కేసులు నడిచి తీరా బండిని తీసుకొనే రోజు వచ్చేసరికి వాహన అస్థిపంజరం మాత్ర మే మిగులుతోంది. స్టేషన్లలో సేఫ్‌గా ఉండాల్సిన వాహనాల పార్టులు మాయమైపోతున్నాయి.



ఇలా చేస్తే బెటర్ కదా..

పోలీస్ స్టేషన్లలో స్వాధీనం చేసుకున్న వాహనాల్లో అధికశాతం ద్విచక్ర వాహనాలే. వాహనం స్వాధీనం చేసుకున్న తర్వాత ఆ వాహనం ధర ను నిర్ధారించి ఆ సొమ్మును కోర్టులో లేదా స్టేషన్లలో డిపాజిట్ చేయించుకుని సదరు వాహనాన్ని యజమానికి అప్పగిస్తే మేలు జరుగుతుంది.ఎవరూ క్లెయిమ్ చేయని వాహనాలను సాధ్యమైనంత త్వరగా చట్టాన్ని అనుసరించి వదిలించుకోవచ్చు. వేలం వేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. వాహనాలు ధ్వంసమయ్యే వరకూ ముగబెట్టి వేలం వేయడం వల్ల భారీ నష్టం కలుగుతోంది. రెండు నెలల కిందట జిల్లాలోని ఎక్సయిజ్ శాఖ పరిధిలో సుమారు 20 వాహనాలు వేలం వేశారు. 20 వాహనాలకు కేవలం రూ.40 వేల వరకూ వచ్చినట్టు సమాచారం. అంటే అందులో ఒక్క వాహనం ఖరీదు కూడా లేదనేది పోలీసెరిగిన వాస్తవం.. అయినా మార్పు కానరావడంలేదు.

వాహనం సీజ్ చేస్తే ఏం చేయాలి..

ఏదైనా కేసులో వాహనం పట్టిబడినా.. రికార్డు లేదని పోలీసులు బైక్ సీజ్ చేసినా.. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినా.. ఆధార్‌కార్డు, బైక్ సీబుక్‌తో కోర్టును ఆశ్రయించాలి. చట్ట పరిధిమేరకు జరిమానా విధిస్తారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేల వరకూ జరిమానా విధిస్తారు. మిగిలిన కేసుల్లో అయితే సీరియస్‌నెస్‌ను బట్టి జరిమానా ఉంటుంది.

మట్టిలో కలిసిపోతున్నాయి..

వాస్తవానికి చట్టం ఉల్లంఘనలపై స్వాధీనం చేసుకున్న వాహనాల విషయంలో వివిధ వెసులుబాట్లు ఉన్నాయని న్యాయవాదులు చెబుతున్నారు.కానీ బండిని తీసుకొచ్చి స్టేషన్లలో పడేయడం.. ఆపై దానిని స్క్రాప్‌గా మార్చడం ఆనవాయితీగా మారిపోయింది.అసలు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలపై లెక్క పక్కాగా లేకపోవడం కొన్ని వాహనాలు మాయం కావడానికి ఆస్కారం కల్పిస్తోందనే విమర్శలున్నాయి. లక్షల రూపాయల విలువైన ద్విచక్ర వాహనాలు,కార్లు ఎండకు ఎండి వానకు తడు స్తున్నాయి.రాజమహేంద్రవరం,ధవళేశ్వరం,ఉండ్రాజవరం,బొమ్మూరు,రాజానగరం,కొవ్వూరు, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల పోలీస్‌స్టేషన్ల వద్ద వాహనాలు మట్టిలో కలిసిపోతున్నాయి.

చెత్తగా ప్రభుత్వ కార్యాలయాలు..

వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో వాడకంలో లేని వాహనాలు, పనికిరాని ఫైళ్లు, విరిగిన చెక్క కుర్చీలు, టేబుళ్లు, ఇనుము సామగ్రి ఒక చోట పోగుగా వేసి వదిలేస్తున్నారు. దీనిని వదిలించుకోవాలనే మాత్రం ఆలోచన ఏ ఒక్కరూ చేయడం లేదు.అధిక శాతం ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ పరిస్థితి ఉంది. ఇక పాత వాహ నాల పరిస్థితి అయితే ప్రత్యేకంగా చెప్పనవ సరం లేదు. ఉదాహరణకు అర్బన్ తహశీల్దారు కార్యాలయం బయట పలు వాహనాలు తుప్పు పట్టి ఏళ్లగా పడి ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రి, ఆర్టీవో కార్యాలయం తదితర చోట్ల ఇదే పరిస్థితి.

- విరిగిన కుర్చీలు..
- పేరుకుపోయిన ఫైళ్లు
- తుప్పుపట్టిన వాహనాలు
- పోలీస్ స్టేషన్ల నిండా బైక్‌లు
- మట్టిలో కలిసిపోతున్న కార్లు
- అయినా పట్టని వైనం



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో

పరీక్షలకో పుస్తకం!



దివాన్‌చెరువు, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తమకు నిర్వహించే పరీక్షలను రాసేందుకు ప్రభుత్వం మూల్యాంకన పుస్తకాలను సరఫరా చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిర్వహించే నాలుగు ఫార్మేటివ్ అసెస్మెంట్, రెండు సమ్మెటివ్ పరీక్షలతో పాటు విద్యాసంవత్సరం చివరిలో నిర్వహించే పరీక్షలు ఈ పుస్తకాల్లోనే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. గతంలో ప్రశ్నపత్రాలను అధికారులు సరఫరాచేస్తే ఆయా పాఠశాలలు తెల్ల కాగితాలను కొని వాటిపై సంబంధిత పాఠశాల స్టాంప్‌లు వేసి ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఈ విధానంలో మార్పు తెచ్చారు. విద్యాశాఖ సరఫరా చేసిన మూల్యాంకన పుస్తకాల్లో ప్రశ్నలవారీ జవాబులు రాసేందుకు తగినంత ఖాళీ ఉంచారు. 10 మార్కులు, 5 మార్కులు, రెండు మార్కుల వారీ జవాబులకు సరిపడే ఖాళీని అందులో ఉంచారు. మూల్యాంకన పుస్తకాలు ఆయా పాఠశాలలకు చేర్చారు. 1 నుంచి 10 తరగతుల వరకూ విద్యార్థులకు సోమవారం నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు జరుగుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

98 వేల క్యూసెక్కులు సముద్రంపాలు

ధవళేశ్వరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):. ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 98,476 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పుడెల్టాకు 4700 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టా 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7వేల క్యూసెక్కులు చొప్పున 14,400 క్యూసెక్కులు కాల్వలకు విడుదల చేశారు.



హౌ..ష్!

పేదల కొంప ముంచిన వైసీపీ

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో పేదల సొంతింటి కల సాకారం అవడం లేదు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా అనుమతులు రావడం లేదు. ఒక పక్క వీరి అర్హతను ధ్రువీకరిస్తూ గృహ నిర్మాణ శాఖ పచ్చజెండా ఊపినా కేంద్రం అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసినా వెబ్‌సైట్‌లో నమోదు చేయడానికి కేంద్రం కావాల్సిన లాగిన్‌లు పూర్తిగా ఇవ్వడం లేదు. దీంతో సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వ సాయం ఎప్పుడు అందుతుందో స్పష్టత లేదు. అధికారులేమో అర్హులైన లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నా కేంద్రం ఆమోదం లేక తిరస్కారానికి గురవుతున్నాయి.గత వైసీపీ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో ఎడాపెడా లెక్కలు చూపడంతో అనుమానాలతో తాజా లబ్ధిదారులను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడానికి సాంకేతిక ఇబ్బందులు అడ్డువస్తున్నాయని చెబుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 44,700 మంది పేదలు దీనంగా ఎదురుచూస్తున్నారు. కొందరైతే నిధులు విడుదల ఖాయమని భావించి పనులు చేసేసి బిల్లులు అందక లబోదిబోమంటున్నారు.

44,700 దరఖాస్తులు..

పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సాయం ప్రకటించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సొంత స్థలం ఉన్న పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామన్న హామీని నెరవేర్చ డానికి దరఖాస్తులు స్వీకరించింది. ఈ మేరకు కేంద్రం,రాష్ట్రం కలిపి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రకటించింది.ఈ మేరకు సచివా లయాల ద్వారా గతేడాది నవంబరు ఆఖరు నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 44,700 మం ది దరఖాస్తులు చేసుకున్నారు.అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18,500 దరఖాస్తులు, తూర్పుగోదావరి జిల్లాలో 12,200, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 వేల దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు అర్హుల కోసం గ్రామాల వారీగా డిమాండ్ సర్వే నిర్వహించగా 95 శాతం మందికిపైగా అర్హత సాధించారు. వివిధ దశల వడపోత అనంతరం రాష్ట్ర ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ లబ్ధిదారుల యాప్‌లో వివరాలు నమోదు చేశారు.



స్పందించని కేంద్రం




లబ్ధిదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లో పట్టణం, గ్రామీణ ప్రాం తం విభాగంలో అప్‌లోడ్ చేయాలి. లబ్ధిదారుడి ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తే అర్హత సాధించిన ఒక్కో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్షలు,రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేయాలి. ఇక్కడే అసలు చిక్కు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి ఏ ఇబ్బందీ లేకపోయినా కేంద్రం నుంచే సమస్య తలెత్తింది. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలు అధికారులు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఇలా చేయాలంటే గ్రామాల వారీగా ప్రత్యేకంగా కేటాయించిన లాగిన్‌లను ఉపయోగించి పథకానికి అర్హత సాధించిన వారి వివరాలు అప్‌లోడ్ చేస్తారు. కానీ ఇప్పటి వరకు కేంద్రం అసలు లాగిన్‌లే ఇవ్వలేదు.దీంతో ఎంపికైన లబ్ధిదారుల వివరాలు జిల్లా అధికారుల వద్దే ఉండిపోయాయి.కాకినాడ జిల్లాలో 326 గ్రామాలకు లాగిన్లు ఇవ్వాల్సి ఉంటే ఇప్పటి వరకు 106 గ్రామాలకే లాగిన్‌లు ఇచ్చారు.వీటి ద్వారా లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తే కేవలం 1800 దరఖాస్తులు మాత్రమే కేంద్ర వెబ్‌సైట్ స్వీకరించింది. కోనసీమ జిల్లాలో 286 గ్రామాలకు 47 గ్రామాలకే లాగిన్‌లు ఇవ్వగా దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తుంటే స్వీకరించడం లేదు. తూర్పుగోదావరి జిల్లాలో 303 గ్రామాలు ఉంటే 55 గ్రామాలకు కూడా లాగిన్‌లు కేటాయించలేదు. దీంతో లబ్ధి దారులకు ఇప్పట్లో కేంద్రం నుంచి ఇళ్ల నిర్మాణ అనుమతులు వచ్చేలా కనిపించడం లేదు.

గాలి లెక్కలతో అస్తవ్యస్తం

కేంద్రం పీఎం అవాస్ యోజన 2.0 కింద ఉమ్మడి జిల్లాలో సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. కేంద్రం లాగిన్‌లలో లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తేనే ఇది సాధ్యం. కేంద్రం లాగిన్‌లు ఇవ్వకపోవడానికి గత వైసీపీ హయాంలో జరిగిన అడ్డదిడ్డ నిర్ణయాలే కారణమని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో గొప్పల కోసం కట్టని ఇళ్లను సైతం జగనన్న ఇళ్ల కాలనీల పేరుతో కేంద్రానికి దొంగ లెక్కలు చూపించేశారు. తద్వారా నిధులు రాబట్టేశారు.ఎక్కడో ఊరి చివర, శ్మశానాల వద్ద ఖాళీ స్థలాల్లో పేదలకు భూములిచ్చారు. ఇవన్నీ ముంపు ప్రాంతాలు, ఊళ్లకు దూరంగా ఉండడంతో లబ్ధిదారులు అసలు ఇళ్లు కట్టలేదు. ఇవి పూర్తకపోవడంతో కేంద్రం సీరియస్‌గా ఉంది.ఈ నేపథ్యంలో తాజా లబ్ధిదారులకు చిక్కులు తలెత్తాయి. పాతవి పూర్తికాకపోవడం,నిధులు లాగేయడంతో ఇప్పుడు కేంద్రం కొత్త లబ్ధిదారులను పరిగణనలోకి తీసుకోకుండా లాగిన్‌లు ఇవ్వడం మానేసింది. అప్పటి జగన్ ప్రభుత్వ నిర్వాకం ఇప్పుడు అసలు సిసలు పేదల కొంపముంచింది. డిమాండ్ సర్వే పూర్తవడంతో పథకానికి అర్హత వచ్చేసిందన్న ధీమాతో ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం అనేకమంది పేదలు పునాదులు,శ్లాబ్‌స్థాయి వరకు నిర్మాణాలు చేసేశారు.తీరా బిల్లులు కాదుకదా..కేంద్రం లాగిన్‌లు ఇవ్వకపోవడంతో తలలుపట్టుకుంటున్నారు.

- పీఎంఏవైకు ఎదురుచూపులు
- దరఖాస్తులు చేసి 8 నెలలు
- ఇంకనూ రాని అనుమతులు
- 44,700 మంది దరఖాస్తు
- గృహనిర్మాణ శాఖ సర్వే పూర్తి
- 95 శాతం అర్హులుగా గుర్తింపు
- నమోదు కాని వివరాలు
- లాగిన్‌లు కేటాయించని కేంద్రం



నిమ్మ రైతు..కంటి చెమ్మ!

- అమాంతం పడిపోయిన మార్కెట్
- కేజీ రూ.20 నుంచి రూ.25
- గిట్టుబాటు కాక ఆందోళన
- లబోదిబోమంటున్న రైతులు

గోపాలపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక నిమ్మరైతుల కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. పెట్టుబడితో పాటు శ్రమకు తగిన ఫలితం లేకపోవడంతో నిమ్మకాయలు చెట్ల నుంచి కోయడానికి కూడా రైతు అడుగు ముందుకు వెయలేకపోతున్నాడు. ఆశించిన ధర దక్కకపోవడానికి ధరలు తగ్గుదలే ప్రధాన కారణమని నిమ్మరైతులు చెబుతున్నారు. ఏళ్ల కొద్దీ తోటలు పెంచి పూతసమయంలో వర్షాలు కురవడం, పూత రాలిపోవడం వంటి పరిణామాలు నిమ్మ రైతులపై ప్రభావం చూపుతున్నాయి. వేసవిలో ధరలు గరిష్ఠంగా పెరగడంతో దిగుబడి లేక రైతులు ఆశించిన స్థాయిలో నిమ్మకాయలు ఉత్పత్తి చేయలేకపోయారు. ప్రస్తుతం దిగుబడి అధికంగా ఉన్నప్పటికి ధరలు పడిపోవడంతో నిమ్మరైతుకు అనాసక్తి కలుగుతుంది. ఈ ఏడాది వేసవిలో కిలో నిమ్మ ధర గరిష్ఠంగా రూ.70 - రూ.80ల వరకు పెరిగింది. రైతుకు ఆశించిన స్థాయిలో ధర ఉన్నప్పటికి ఉత్పత్తి, దిగుబడి లేకపోవడంతో డీలా పడ్డారు. ప్రస్తుతం దిగుబడి ఉన్నా ధరలు పతనం కావడంతో కిలో నిమ్మ ధర రూ.25 -20 పలుకుతోంది. కిలోకు చిన్న సైజు అయితే 25 కాయలు వస్తాయి.. పెద్ద సైజు అయితే 18 కాయలు వరకూ వస్తాయి. దీంతో దిగుబడి ఉన్న ఫలితం దక్కడం లేదంటూ నిమ్మరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మపై పొగాకు ప్రభావం

ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో పొగాకు, నిమ్మ సాగుపై ప్రభావం చూపుతుంది. దీంతో ఆశించిన స్థాయిలో పెట్టుబడికి దగ్గ ఫలితం లేకపోవడంతో నిమ్మ రైతులు పొగాకు సాగుపై మక్కువ చూపుతున్నారు. గత మూడేళ్లగా పొగాకు ధరలు గరిష్ఠంగా పెరగడంతో నిమ్మను తొలగించి పొగాకు సాగుపై నిమ్మరైతులు సాగుకు మక్కువ చూపుతున్నారు. కాస్తో కూస్తో మిగిలిన నిమ్మ రైతులకు కనీస ధరలు దక్కకపోవడంతో నిరాశచెందుతున్నారు. నిమ్మ ధరలు ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో నిమ్మ సాగు కనుమరుగయ్యే పరిస్థితి ఉంటుంది.

కూలీల ఖర్చులు రావడంలేదు



రెండెకరాల నిమ్మతోటలో కాయలు కోసి మార్కెట్‌కు తీసుకెళితే కనీసం కూలీల ఖర్చుకు రావడం లేదు. దీంతో నిమ్మకాయలు కొయ్యకుండా తోటలోనే వదిలేశాం. ప్రభుత్వం నిమ్మసాగు రైతులకు మద్దతు ధర ప్రకటిస్తే రైతులు గట్టెక్కుతారు.

- వి.కృష్ణమూర్తి, రైతు, కరిచర్లగూడెం

సాగుపై మక్కువపోయింది



గత దశాబ్ద కాలంగా నిమ్మ సాగు చేస్తున్నా. అధిక లాభాలు చూసిన రోజులు ఉన్నాయి. ప్రస్తుత నిమ్మ మార్కెట్ అందుకు భిన్నంగా ఉంది. ఎంత శ్రమ పడినా ఫలితం లేక నిమ్మసాగుపై ఉన్న మక్కువ పోయింది. ఈ - మార్కెట్ ఏర్పాటు చేయాలి.

-కాశిం సాహెబ్, రైతు, కొవ్వూరుపాడు

ఏలేరులో పెరుగుతున్న నీటి నిల్వలు


ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు

ఏలేశ్వరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. మెస్తారు వర్షాలు, గోదావరి జలాలు విడుదల చేస్తుండడంతో రిజర్వాయర్‌లోని నీరు పెరుగుతోంది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం నుంచి గోదావరి జలాలు 1225 క్యూసెక్కులు ఏలేరు జలాశయానికి విడుదలవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనిరీతిలో ప్రాజెక్టులో 86.56 మీటర్ల స్థాయిలో 24.11 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. 77.45 మీటర్ల స్థాయిలో 10.66 టీఎంసీలు నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నంకి 300 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 600 క్యూసెక్కుల వంతులకు నీరు చేరుతోంది. దీంతో రైతులకు సాగు నీరు విడుదలవ్వడంతో రైతులకు పంటలపై భరోసా ఏర్పడింది.

ఉప్పాడ ఉప్పొంగే..

మత్స్యకారుల ఇళ్లల్లోకి సముద్ర కెరటాలు

అవస్థలు పడుతున్న మత్స్యకారులు



ఉప్పాడ మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లల్లోకి చేరిన నీరు

కొత్తపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి ఉప్పాడ తీరంలో సముద్రం ఆదివారం మళ్లీ ఉప్పొంగింది. దీంతో మాయాపట్నంలో మత్స్యకారుల ఇళ్లల్లోకి కెరటాలు రావడంతో బిందెలు, దాకలు, ఇతర వంటసామగ్రి సముద్రంలో కొట్టుకుపోయాయి. పౌర్ణమి కారణంగా సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. సుమారు 15రోజుల కిందట అమావాస్య కారణంగా సముద్రం ఉప్పొంగడం, సుమారు 10 మత్స్యకార ఇళ్లు కొట్టుకుపోవడం విధితమే. గతంలో మాయాపట్నం గ్రామానికి జియోట్యూబ్ రక్షణ కవచంలా ఉండేది. ప్రస్తుతం ఇక్కడ జియోట్యూబ్ ఆనవాలు లేకుండా కొట్టుకుపోవడంతో రోజు సముద్రంలో ఏర్పడే పోటుపాట్లకు... అలాగే అమావాస్య, పౌర్ణమిరోజుల్లోను, అల్పపీడనాలు ఏర్పడే సందర్భాల్లో కెరటాల ధాటికి నష్టపోయేది మాయాపట్నం గ్రామం కావడంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రకోత నుంచి రక్షించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

శ్రీపాద శ్రీవల్లభుడికి ప్రత్యేక పూజలు


శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

పిఠాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ (రాఖీ) పౌర్ణమికి మహారాష్ట్ర, గోవా, ఢిల్లీ, కర్ణాటకలతో పాటు ఉత్తరాది రాష్ట్రాల భక్తులు శ్రీపాదుని దర్శనానికి రావడంతో ఆలయ పరిసరాలు రద్దీగా మారాయి. శ్రీపాద శ్రీవల్లభుడికి అభిషేకాలు, సర్వపుష్ప పూజ, నామార్చన నిర్వహించారు. దత్త హోమం, గోపూజ జరిగాయి. అనంతరం శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతులను పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లికి పోటెత్తిన భక్తులు


వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలు, పాల్గొన్న భక్తులు

రూ.6.63 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని ఆదివారం అధికసంఖ్య లో భక్తులు దర్శించుకున్నారు. నోము ఆ చరించి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఆది వారం ఆలయానికి రూ.6,63,297 ఆదా యం లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి నిడదవోలు మండలం కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన బెల్లపు కొండ కృష్ణమూర్తి, గొడవర్తి వరలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. సత్తెనపల్లికి చెందిన దేవిశెట్టి నాగేశ్వరరావు- విజయలక్ష్మి దంపతులు రూ.25,116 విరాళం సమర్పించారు. వారికి ఈవో తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.

శరవేగంగా నిర్మాణ పనులు

వెంకన్న ఆలయంలో మాస్టర్ ప్రణాళిక ప్రకారం మెగా ప్రాజెక్టులైన వకుళమాత అన్నప్రసాద భవనం, ఆలయం ఎదురుగా పుష్కరిణి(కోనేరు) నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నారు. ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శ్రీనివాస ప్రాంగణంలో రూ. 6.10కోట్లతో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఈ భవనంలో 3వేల మంది



భక్తులు ఒకేసారి అన్నప్రసాదం స్వీకరించేలా రూపకల్పన చేశారు. మరో రూ.1.50కోట్లతో అన్నప్రసాద భవనంలో సామాగ్రి కొనుగోలు చేసేందుకు దాతలు ముందు కు వస్తున్నారు. ఆలయం ఎదురుగా తిరుమల తరహాలో రూ.2.80 కోట్లతో పుష్కరిణి,(కోనేరు) నిర్మాణం వేగవంతం చేస్తున్నారు. పనులు స్వామివారి ఉత్సవాలకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

తలుపులమ్మకు మకరతోరణం బహూకరణ


అమ్మవారికి బహూకరించిన మకరతోరణం

తునిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో తలుపులమ్మ అమ్మవారికి కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వాసా శ్రీనివాస్ సుమారు రూ.1.25 లక్షలు విలువచేసే 8 కిలోల రాగి, ఇతర లోహాలతో తయారుచేసిన మకరతోరణాన్ని ఆదివారం బహూకరించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మకరతోరణాన్ని అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరించారు. అమ్మవారిని ఆదివారం వేలాది భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయానికి రూ.5లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

ప్రమాదవశాత్తు కొబ్బరి దింపు కార్మికుడి మృతి


సత్యనారాయణ మృతదేహం

ఆత్రేయపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి చెట్టు ఎక్కి దింపుతీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వసంతవాడకు చెందిన కారకి వీరవెంకట సత్యనారాయణ(42) దింపు కార్మికుడు. ఆదివారం రామిరెడ్డి వీరభద్ర రైతు పొలంలో కొబ్బరి కాయలు దింపు తీస్తుండగా ప్రమాదవ శాత్తు చెట్టుపై నుంచి జారి పడ్డాడు. వెంటనే స్థానికులు కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

ఇంటి నుంచి అదృశ్యం.. గోదావరిలో మృతదేహం లభ్యం

కొవ్వూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భార్యతో ఘర్షణ పడి ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి మృతదేహం గోదావరిలో లభ్యమైనట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. బంధువులకు సమాచారం అందించగా కోరశిఖ సత్యనారాయణ(43)గా గుర్తించారు. అతడు ఈనెల 8వ తేదీన రాత్రి భార్యతో ఘర్షణపడి ఇంటి నుంచి బయటకు వచ్చేశాడు. తిరిగి రాకపోవడంతో మృతుడి కుమారుడు కోరశిఖ లక్ష్మీనారాయణ 9న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక ర్యాంపు వద్ద గోదావరిలో మృతదేహం లభ్యం కావడంతో జాలర్ల సహాయంతో బయటకు తీయించి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సత్యనారాయణ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సాయిప్రశాంత్

కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్ట్

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురక్షితం

రంపచోడవరం/దేవీపట్నం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం శరభవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సోయం శ్రీ సౌమ్యను ఈ నెల 7న ఉదయం 10, 11 గంటల మధ్యలో ఏడుగురు వ్యక్తులు ఇన్నోవా వాహనంలో వచ్చి కిడ్నాప్ చేసిన ఘటనలో ప్రధాన నిందితుడితో పాటు మరో నలుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ జి.సాయి ప్రశాంత్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రత్యేక పోలీసు బృందం గుర్తేడు వద్ద ఏ1 నిందితుడైన కోంకోట అనిల్‌కుమార్, ఏ2 కళ్యాణం ఉమా మహేష్, ఏ3 రాగోలు దుర్గ విఘ్నేష్‌తో పాటు మరోఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, బాధితురాలని సురక్షితంగా రక్షించామని పేర్కొన్నారు. ఏ1 అనిల్‌కుమార్‌పై ఎన్డీపీఎస్ కేసులతో సహా క్రిమినల్ చరిత్ర ఉన్నట్టు తెలిపారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు.

సెమీస్ వన్‌సైడ్!

కాకినాడలో జాతీయ మహిళా జూనియర్ హాకీ పోటీలు



ప్లేయర్ ఆఫ్ ది అవార్డు అందిస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ నాగార్జునరెడ్డి


తలపడుతున్న జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ జట్లు

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళ జాతీయ చాంపియన్‌షిప్-2025లో భాగంగా కాకినాడ క్రీడా మైదానంలోని ఆస్ట్రోటర్ఫ్ హాకీ ఫీల్డ్‌లో ఆదివారం జరిగిన రెండు సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు వార్ వన్ సైడ్ అన్నట్టు సాగాయి. హర్యానా, ఛత్తీస్‌గడ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హర్యానా 3-0 స్కోరుతో విజయం సాధించింది. జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య మ్యాచ్‌లో జార్ఖండ్ 3-0 స్కోరుతో విజయం సాధించింది. హాకీ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఎం.నాగార్జునరెడ్డి, కాకినాడ కోరమండల్ సెంటర్ హెడ్ జేఎస్ గంధం ముఖ్యఅతిథులుగా హాజరై మ్యాచ్‌లు వీక్షించారు. కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్, రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి హర్షవర్ధన్, సంయుక్త కార్యదర్శి వి.రవిరాజు, కోశాధికారి పి.తామస్‌పీటర్, భవాని శంకర్ మ్యాచ్‌లను పర్యవేక్షించారు.


హాకీ ఆడుతున్న హర్యానా, ఛత్తీస్‌గఢ్ జట్లు

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వర్మ


వర్మ

అమలాపురం టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడిగా జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఎన్నికలను ఏపీఎన్జీవో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వర్మ తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజు గౌరవాధ్యక్షుడిగా సలాది సాయిసత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా రేపాక వెంకటరాము, ఉపాధ్యక్షుడిగా కె.కిశోర్, సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారిగా జీవీవీఎన్ త్రినాథ్, ఉపాధ్యక్షుడిగా తనికెళ్ల శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా కె.సునీత, రాష్ట్ర ప్రతినిధిగా డొక్కా రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. ఎన్నికల అధికారులుగా కె.రంగారావు, పి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేసే ఉద్యోగుల సంక్షేమానికి నిరంతరం పాటుపడతానని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జుల్ఫికర్ ఆలీ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పేపకాయల వెంకటకృష్ణ, చార్లెస్ పలువురు అభినందించారు.

'శ్రీప్రకాష్'లో హోరాహోరీగా ఖోఖో పోటీలు


ఖోఖో ఆడుతున్న బాలురు

తునిరూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో అండర్ 14, 17, 19 బాలుర, బాలికల విభాగంలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 అంతరాష్ట్ర ఖోఖో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. అండర్ 19 బాలికల విభాగంలో ప్రథమ స్థానం సిస్టర్ నివేదిత స్కూల్ హైదరాబాద్, ద్వితీయ స్థానం వెరిటాస్ సైనిక్ స్కూల్ తిరుపతి, తృతీయ స్థానంలో సివిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ ఏలూరు, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ ఖమ్మం నిలిచాయి. విజేతలకు సోమవారం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకులు సీహెచ్‌ఎల్ఎం శ్రీనివాస్, విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ పాల్గొన్నారు.

13న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు 4 నుంచి 13 వరకు చైనాలోని శాంగ్లోలో నిర్వహించనున్న అండర్-15 బాలబాలిక ప్రపంచ స్కూల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి క్రీడాకారుల ఎంపిక ఈనెల 13న కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో చేపట్టనున్నట్టు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లంక జార్జి ఆదివారం తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9గంటలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు 18న విజయవాడ పటమట కేబీసీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి జట్ల ఎంపికలో పాల్గొంటారన్నారు. తర్వాత జాతీయ జట్టు ఎంపిక ఉంటుందన్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఆటోమేటిక్.. ఐడియా..

ఆటోపై సోలార్ ప్యానెల్ బిగింపు

కాకినాడలో డ్రైవర్ వినూత్న ఆలోచన




ఈ పెద్దాయన బుర్రకు పదును పెట్టాడు. పెరుగుతున్న డీజిల్ ధరలతో బతుకు 'బండి' లాగడం కష్టమని భావించి ఇటీవల ఓ ఈ-ఆటోను కొనుగోలు చేశాడు. 8 గంటలు చార్జింగ్ పెడితే సుమారు వంద కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. అయితే రోజుకు 8 గంటల పాటు బ్యాటరీకి చార్జింగ్ పెడితే కరెంటు బిల్లు తడిసిమోపెడవుతోందని.. ఏం చేయాలని ఆలోచించసాగాడు. తన పొలంలో నీళ్లు తోడే మోటారుకు సోలార్ కనెక్షన్ ఉండడం చూసి.. అంత పెద్ద మోటారే సోలార్‌తో పనిచేస్తున్నప్పుడు.. తన ఈ- ఆటోకు పనిచేయదా? అని ఆలోచించాడు. తన ఆలోచనను కాకినాడలోని అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న ఓ సోలార్ టెక్నీషియన్‌కు తెలిపాడు. దీంతో 48 ఓల్ట్స్, 580 వాట్స్ ఉన్న సోలార్ పలకను ఆటోపై భాగాన బిగించాడు. సూర్యకాంతితో ఆటో రయ్.. రయ్ మని కాకినాడ వీధుల్లో తిరగడం ప్రారంభమైంది. ఇంతకీ ఈయన పేరు చెప్పలేదు కదూ.. భాస్కరరావు, ఊరు పెద్దపూడి మండలం అచ్యుతాపురత్రయం. కొన్నేళ్లుగా ఆటో డ్రైవర్‌గా జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. "గతంలో నా ఈ-ఆటోకు గంటల తరబడి చార్జింగ్ పెడితే.. రూ.1500కు పైగా కరెంటు బిల్లు వచ్చేది. ఈ సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేయడంతో చార్జింగ్ పెద్దగా పెట్టాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇప్పుడు మా ఇంటి కరెంటు బిల్లు రూ.800 వరకు వస్తోంది. సోలార్ విద్యుత్ కాస్త డబ్బు ఆదా అవుతోంది." అని పేర్కొన్నాడు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

జేఎన్టీయూకేలో ముగిసిన ఐడీపీ వర్క్‌షాప్

జేఎన్టీయూకే, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని జేఎన్టీయూ సెనేట్ హాల్లో ఐక్యూఏసీ, కెపాసిటీ బిల్డింగ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూషనల్ డవలప్‌మెంట్ ప్లాన్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. అవుట్ లైన్‌ఫర్ డవలపింగ్ ఐడీపీ, ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్ పై కశ్మీర్ సెంట్రల్ యూనివర్శిటీ వీసీ రవీంద్రనాథ్, ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ ఐడీపీ సెల్ గురించి గౌరీదత్ శాస్త్రి వివరించగా డ్రాఫ్టింగ్ ఐడీపీ ప్యానల్ డిస్కషన్‌లో కె.వెంకటేష్ మోడరేటర్‌గా వ్యవహరించారు. వర్క్‌షాప్‌లో జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, డైరెక్టర్ బాలాజీ, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.



వీసీ ప్రసాద్‌తో వర్క్‌షాప్‌లో పాల్గొన్న అతిథులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు

పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో శరవేగంగా రెండో దశ పనులు

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్

మోతుగూడెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పొల్లూరు జల్ విద్యుత్ కేంద్రం రెండో దశలో చేపట్టిన రెండు యూనిట్ల నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయని ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కెవీ.రాజారావు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి అందుబాటులోకి 230 మెగావాట్లు విద్యుత్తు ఉంటుందన్నారు. ఒక్కొక్కటి 115 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ యూనిట్లు మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రస్తుతం ఆరో యూనిట్‌కు స్పిరల్ కేస్ మూడో దశ కాంక్రీట్ పనులు జరుగుతున్నాయని మరొక దశ కాంక్రీట్ వేస్తే పనులు పూర్తవుతాయన్నారు. 5వ యూనిట్‌కు టర్బయిన్ ఫ్లోర్ కాంక్రీట్ పనుల కోసం రిఇజన్ ఫోర్స్‌మెంట్ పనులు జరుగుతున్నాయని ఇవి పూర్తయిన వెంటనే జనరేటర్ బ్యారల్ వరకు ఇంకొక దశ కాంక్రీట్ పనులు చేపట్టాలని, అనంతరం ఎలక్ట్రికల్ మెకానిక్ పనులు ప్రారంభిస్తారన్నారు.

సీఎం చంద్రబాబుతో గీత కులాలకు న్యాయం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గీత కులాలకు న్యాయం చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక లాలాచెరువు సెంటర్లోని దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం వద్ద ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గీతకులాలకు మద్యం షాపుల్లో 10శాతం రిజర్వేషన్‌తోపాటు 50శాతం ఫీజు రాయితీ కల్పించిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో 34శాతం ఉన్న అవకాశాలను 24శాతానికి కుదించిందని, కూటమి ప్రభుత్వం దాన్ని 34శాతానికి పునరుద్ధరించిందన్నారు. ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంకు పాలకవర్గంలో గీత కులాలకు ప్రాతినిధ్యం, దేవదాయ కమిటీల్లో శెట్టిబలిజలకు అధిక ప్రాధాన్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆర్యాపురం బ్యాంకు డైరెక్టర్ బుడ్డిగ రవి, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ యామిన నారాయణగౌడ్, కడలి రామకృష్ణ, మరుకుర్తి రవి యాదవ్, చింతపల్లి నాని పాల్గొన్నారు.

అనపర్తి సొసైటీ అధ్యక్షుడిగా శ్రీను

కుతుకులూరు అధ్యక్షుడిగా సుబ్బారెడ్డి



అనపర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన వ్యవసాయం సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీల్లో అనపర్తి, బిక్కవోలు మండలాలకు చెందిన 12 సొసైటీలకు నియామకాలు జరిగాయి. అనపర్తి మండలంలో ఐదు సొసైటీలకు బిక్కవోలు మండలంలోని ఏడు సొసైటీలకు కమిటీలను ప్రభుత్వం నియమించింది.అనపర్తి మండలంలో అనపర్తి చైర్మన్‌గా కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొప్పవరం-సబ్బెళ్ల రామారెడ్డి,కుతుకులూరు-నల్లమిల్లి సుబ్బారెడ్డి, పొలమూరు-సత్తి సత్యనారాయణరెడ్డి, పులగుర్త-జాస్తి రామచంద్రరావు, బిక్కవోలు మండలం బలభద్రపురం చైర్మన్‌గా నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, బిక్కవోలు-పాలచర్ల వెంకట శివప్రసాద చౌదరి, కొమరిపాలెం-ద్వారంపూడి వెంకటరెడ్డి, కొంకుదురు-చింతా శ్రీనివాసరెడ్డి, మెళ్లూరు-సీహెచ్ వేణుగోపాలకృష్ణ, పందలపాక-పడాల సూర్యనారాయణరెడ్డి, ఊలపల్లి-తొండాపు నీరజాస్వాతి నియమితులయ్యారు. ప్రతి కమిటీకి ఇద్దరు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

శంకరంబాడి సుందరాచారి జయంతి


సుందరాచారి చిత్రపటానికి నివాళులు

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనే గీతాన్ని తెలుగువారు పాడుకునేంత కాలం రచయిత శంకరంబాడి సుందరాచారి తెలుగు వారి హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని ఆంధ్ర కేసరి యువజన సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. సుందరాచారి జయంతిని స్థానిక సరస్వతీ ఘాట్ ఆవరణలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ టంగుటూరి సూర్యకుమారి గానంతో 1975లో తొలి తెలుగు ప్రపంచ మహాసభల్లో పాడిన తెలుగు తల్లి గీతాన్ని ప్రభుత్వం రాష్ట్ర గీతికగా గుర్తించిందన్నారు. కార్యక్రమంలో సరస్వతీ పీఠం నిర్వాహకుడు తోట సుబ్బారావు, రాజమండ్రి నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ, అమృతం సత్యనారాయణ, నారాయణరావు, చంద్రశేఖర్, కాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


కడియంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ దృశ్యం

కడియం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): విలువలే ప్రధాన ధ్యేయంగా ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ అని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. కడియంలో ఆదివారం యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ అబ్బాయి, వి.శాస్త్రి అధ్యక్షతన జరిగింది. ఉపాధ్యాయ నేత, సీనియర్ కామ్రేడ్ ఆర్‌వీ రమణ యూటీఎఫ్ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. ఉపాధ్యాయ ఉద్యమ పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గోపాలకృష్ణ, పి.నాగేశ్వరరావు, దొరబాబు, ఆనంద విజయకుమార్, ఆకుల వీర్రాజు, ఉంగరాల వీరభద్రరావు, సందీప్, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరావు, రామచంద్రారెడ్డి, సతీష్‌రెడ్డి, దంగేటి సత్యనారాయణ, అంజనీకుమార్, టి.శ్రీనివాస్, వి.శ్రీనివాస్, సతీష్ కుమార్ పాల్గొన్నారు.



ఊలపల్లిలో నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్రజాప్రయోజనాల దృష్ట్యా రోడ్డు పనులు

రఘుదేవపురం-సీతానగరం రహదారి పనులపై ఎమ్మెల్యే బత్తుల స్పష్టత

సీతానగరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాల దృష్టిలో ఉంచుకుని రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రోడ్డు పనులు ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ చేతకాక వదిలేసిందని, బినామీ పేర్లతో కాంట్రాక్టులు చేయడం వల్లనే ఈ సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం ప్రజల సమస్యలు, వారు పడుతున్న కష్టాలను తగ్గించడానికి రోడ్డు పనులు చేస్తుంటే.. చేతగాక వదిలేసిన వాళ్లే అడ్డుపడుతున్నారన్నారు. రఘుదేవపురంలో నాలుగు లైన్ల రోడ్డు పనులకు అక్కడ కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో నిలిచిపోయాయని, అందువల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రస్తుతం 34 అడుగుల వెడల్పున రోడ్డు పనులు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. కోర్టు కేసులు సమస్య పరిష్కరించి తదుపరి 66 అడుగుల రోడ్డును పూర్తిచేస్తామన్నారు. రఘుదేవపురంలో ఆక్రమణల తొలగింపు కోసం 2021లో రూ.9 కోట్లు పరిహారం ఇవ్వలేక గత ప్రభుత్వం చేతులెత్తేసిందని, ఆ పరిహారం ఇప్పుడు రూ.14 కోట్లు అయిందన్నారు. ఈ రోడ్డు కోసం రూ.104 కోట్లు బడ్జెట్ పెట్టామన్నారు. రానున్న రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరించి పూర్తిస్థాయిలో రోడ్డు పూర్తిచేస్తామని ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు.

ఏపీ స్టేట్ ర్యాంకింగ్ చదరంగం పోటీలు



చదరంగం పోటీల్లో గెలుపొందిన బాలికలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లో జిల్లా చదరగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం 5వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ర్యాంకింగ్ చదరంగం పోటీలు నిర్వహించారు.ఈ పోటీలు అండర్-6,8,10,12,16 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించారు. అన్ని కేటగిరిలలో సుమారు 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చదరంగం సంఘం సభ్యులు కేవీవీ శర్మ, కె.జగదీష్, శేషగిరి, వై.కళ్యాణ్‌కుమార్, జీవీ కుమార్, జి.హేమచంద్రమౌళి జి.కార్తీక్‌గోపాల్, ఎంకే చెస్ అకాడమీ డైరెక్టర్స్ పాల్గొన్నారు.

బిక్కవోలులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

బిక్కవోలు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయించి వారిలో దేశభక్తిని పెంపొందించాలన్నదే హర్ ఘర్ తిరంగా లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బిక్కవోలులో ఆదివారం అధికారులు, ప్రజలు జెండాలు చేతబూని నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ జెండాపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ నెల 15న బీజేపీ నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేయడంతోపాటు ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొనేటట్టు చూడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో నాగేంద్రప్రసాద్, ఎస్‌ఐ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఇంటిపై

జెండా ఎగరాలి

- ఆర్డీవో కృష్ణ నాయక్
- ఘనంగా హర్ ఘర్ తిరంగా
- జాతీయ జెండాలతో ర్యాలీలు

ధవళేశ్వరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తితో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి చాటుకోవాలని ఆర్డీవో కృష్ణనాయక్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు నిర్వహిస్తున్న తిరంగా యాత్ర ధవళేశ్వరంలో అధికారులు, కూటమి నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన యాత్ర ప్రధాన రహదారి గుండా సాగింది. ఆర్డీవో కృష్ణనాయక్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, తహశీల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు, కూటమి నాయకులు త్రివర్ణ పతాకాలు చేతబూని భారతమాతాకు జై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, పి.అప్పారావు, యర్రమోతు ధర్మరాజు, ఆళ్ల ఆనందరావు, సావాడ శ్రీనివాసరెడ్డి, పుక్కెళ్ల రాజు, పల్లా రామస్వామి, అబ్దుల్ రెహ్మాన్‌ఖాన్, యడ్ల మహేష్, కొప్పిశెట్టి గాంధీ, షేక్ అమీనా తదితరులు పాల్గొన్నారు.

కడియం: కడియంలో పంచాయతీ కార్యాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకూ జాతీయ జెండాలతో ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ ఎలుగుబంటి వెంకట సత్యప్రసాద్, ఎంపీడీవో కె.రమేష్, తహశీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసే విధంగా ప్రజలను చైతన్యపరచాలని కోరారు. సోమవారం నుంచి ప్రతి సచివాలయం పరిధిలో ఈ ర్యాలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో సుబ్బారావు, సీనియర్ అసిస్టెంట్ దాస్, పంచాయతీ కార్యదర్శులు అయినవిల్లి శ్రీనివాసరావు, రావిపాటి సత్యనారాయణ, పలువురు వీఆర్వోలు, సచివాలయ, అంగన్వాడీ, వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో అధికారులు, నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్



కడియంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనపర్తి: రామవరంలోని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నివాసం నుంచి పొలమూరు మీదుగా అనపర్తిలోని గాంధీ బొమ్మ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశభక్తిని కలిగి ఉండాలని దేశం కోసం ఎటువంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగురాలన్నదే ప్రధాన సంకల్పమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో ఆళ్ల గోవిందు, తమలంపూడి సుధాకరరెడ్డి, వెలుగుబంటి సత్తిబాబు, వేణుగోపాలరెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, రావాడ నాగు, కర్రి బులిరెడ్డి, కర్రి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంపీడీవో రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అధికారులు హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీలో చేపట్టారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో భారతి, డిప్యూటీ తహశీల్దార్ సునీత,డిప్యూటి ఎంపీడీవో మూర్తి, ఎస్‌ఐ రామ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నాలుగుబొమ్మల సెంటర్ మీదుగా పాత బస్టాండ్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


సీతానగరంలో జెండాలతో మానవహారం

ప్రాచీన ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి

- ఎమ్మెల్యే నల్లమిల్లి
- బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం


పందిరి రాట వేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిని కాపాడాలనే ఉద్దేశ్యంతో ప్రాచీన ఆలయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో ఈనెల 27న నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు ఆదివారం సతీమణి మహాలక్ష్మితో కలిసి ఆయన పందిరిరాట వేసి ఉత్సవ పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా వారిద్దరు స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులు స్థల సేకరణ చేస్తున్నారని ఆపై ఆలయాభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఇక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రసాద్ పథకంలో కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి లక్ష్మీగణపతి ఆలయంతో పాటు గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, గొల్లల మామిడాడలోని సూర్యనారాయణమూర్తి, రామాలయాలను అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి, కూటమి నాయకులు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, రావాడ నాగు, వైదాడి వెంకటేశ్వరరావు, సింగారపు రామారావు, బేరా వేణమ్మ, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు. అలాగే కొంకుదురులోని మార్కెట్ సెంటర్‌లోని గణపతి నవరాత్రి ఉత్సవాలకు గ్రామానికి చెందిన సత్తి లక్ష్మీనారాయణరెడ్డి సత్యప్రియ దంపతులు రాట ముహూర్తం చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చిన్నం వీరభద్రారెడ్డి మాట్లాడుతూ 63 ఏళ్లుగా ఉత్సవాలు జరుపుతున్నామన్నారు. కమిటీ సభ్యులు వెంకటరెడ్డి, రామారెడ్డి, బాబ్జి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

రంగంపేట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారిలో శ్రీలక్ష్మీ దుర్గమ్మకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిగా విజయం సాధిస్తే విందు ఏర్పాటు చేస్తామని రంగంపేట టీడీపీ నాయకుడు జుజ్జువరపు సుబ్బారావు (జమి) గతంలో మొక్కుకున్నారు. ఈ మేరకు ఆదివారం జమి మొక్కును చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, ఎలుగుబంటి సత్తిబాబు, సత్తి దేవానందరెడ్డి, ఉద్దండ్రావు శ్రీను, ఉండవిల్లి గిరిబాబు, పోతుల చిన్నికాపు, గారపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రచయితల సమావేశం


సమావేశంలో పాల్గొన్న రచయితలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి వీరేశలింగం పుర మందిరంలో ఆదివారం కళా గౌతమి రచయితల సమావేశం జరిగింది. కళా గౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్‌మూర్తి.. ఇటీవల మృతిచెందిన రచయితలు పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ సతీమణి భానుమతికి, కోడూరి శ్రీరామమూర్తికి నివాళులర్పించారు. సభలో రచయితలు వివిధ కవితలను వినిపించారు. కార్యక్రమంలో బీహెచ్ రమాదేవి, నాట్యాచార్యులు సప్పా దుర్గాప్రసాద్, బేతా శారదాదేవి, పీవీబీ సంజీవరావు, వీవీ సుబ్రహ్మణ్యం, కృష్ణమోహన్, ఓబులేసు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులు

- జనసేన జిల్లా కార్యదర్శులు శివరాం, శ్రీరామ్
- నామినేటెడ్ పదవులు పొందిన మహిళలకు సత్కారం


కోరుకొండలో అరుణకుమారి, దేవిదుర్గలను అభినందిస్తున్న జనసేన నాయకులు

కోరుకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని నమ్ముకుని పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నామినేటెడ్ పదవులు ఇచ్చి గౌరవించారని పార్టీ జిల్లా కార్యదర్శులు మేడిశెట్టి శివరాం, కిమిడి శ్రీరామ్ అన్నారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన ఎస్సీ మహిళ కందికట్ల అరుణకుమారికి జిల్లా స్థాయిలో డ్వాక్రా సంఘాల సమాఖ్య ప్రెసిడెంట్‌గాను, కోరుకొండ మండలం కణుపూరు గ్రామానికి చెందిన బీసీ మహిళ ముక్కా దేవి దుర్గను ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారిద్దరినీ సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శులు మాట్లాడుతూ ఎవరైతే పార్టీ కోసం అహర్నిశలు కష్టపడ్డారో వారికి నామినేటెడ్ పదవులు దక్కాయని పార్టీలో ఇది చాలా శుభ పరిణామం అన్నారు. ఒక దళిత మహిళకు జిల్లా స్థాయి పదవి ఇవ్వడంతో దళితులందరికీ పార్టీలో సముచిత స్థానం దక్కిందని దళిత నాయకులు పేర్కొన్నారు. అనంతరం దేవిదుర్గను, అరుణకుమారిని నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో కారిచర్ల విజయశంకర్, ముక్కా రాంబాబు, కొత్తపల్లి రఘు, కర్రి దొరబాబు, ఏసుపాదం, తాటికొండ శ్రీను, నాతిపాము దొరబాబు, తోట రామకృష్ణ, యర్రంశెట్టి పోలారావు, దేవన దుర్గాప్రసాద్, కర్రి దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

శారదారావు జయంతి


పిడింగొయ్యిలో శారదారావు చిత్రపటానికి నివాళులు

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి గ్రామంలోని జీఎస్‌కేఎం లా కళాశాల వ్యవస్థాపకురాలు వి.శారదారావు 104వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యావేత్త పూడి హేమలతకు శారదారావు స్మారక పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శరత్, ప్రిన్సిపాల్ మధుసూదనరావు, లక్ష్మీశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తైలాభిషేక పండుగ

కడియం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక షారోన్ దైవిక స్వస్థతశాలలో ఆదివారం తైలాభిషేక పండుగ జరిగింది. 40 రోజుల ఉపవాస ప్రార్థనల అనంతరం ఈ పండుగను పాస్టర్ డి.రతన్‌రాజు నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన విశ్వాసులకు తైలం పోసి ప్రార్థన చేసి అభిషేకించారు. కళ్లెం జ్యోతి, సలాది శ్రీను, సువర్ణ, గొడవర్తి సుధ, నవ్య, బొర్రా బేబి పాల్గొన్నారు.

950 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

కొత్తపల్లి, కామరాజుపేటలో తనిఖీలు

గోకవరం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కొత్తపల్లి, కామరాజుపేట గ్రామాల్లో ఆదివారం రాత్రి ఏఎస్‌వో నాగాంజనేయులు, ఎంఎస్‌వో శాంతిప్రియ తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన సుమారు 950 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.





హర్..ఘర్ తిరంగా..

దేశ పతాకపు.. జాతిపతాకపు చెప్పర జైహింద్.. అందరి గుండెల వందేమాతర గీతం జైహింద్ అంటూ జనం వీధుల్లో కలియ తిరిగారు.. అందరిలోనూ దేశభక్తిని రగిలించారు.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆదివారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఊరూవాడా ఘనంగా నిర్వహించారు.. ఒక్కొక్కరుగా జాతీయ జెండాలతో జత కలిశారు.. వందేమాతరం వందేమాతరం అంటూ నినదించారు.. అనపర్తిలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు.. కొవ్వూరులో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కినాగేంద్ర జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ చేశారు. మండల కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ హర్ ఘర్ తిరంగా నిర్వహించారు. 8

చిత్రం.. విచిత్రం!

ప్రోగ్రామ్‌కు తగినట్టు అలంకరణలు చేసేస్తున్నారు.. అలరిస్తున్నారు.. శ్రావణ మాసంలో ముత్తయిదువులదే ప్రత్యేక స్థానం.. ఇలాగే చాగల్లులో ఆదివారం ఒక ప్రత్యేక వాహనం చక్కర్లు కొట్టింది.. వాహనంపై బొమ్మ ముత్తయిదువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ధనలక్ష్మి అమ్మవారిని ఊరేగించారు.



నేడు జాబ్ మేళా

రాజమహేంద్రవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని మోడల్ కేరీర్ సెంటర్ ప్రాంగణంలో సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి హెచ్.హరీశ్ చంద్ర ప్రసాద్ తెలిపారు. ఇన్నోవా సోర్స్, ఎస్‌బీఐ పేమెంట్, నవత, ఆపాక్ ఫైనాన్సియల్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులన్నారు.ఆసక్తి కలిగిన వారు https://tinyurl.com/jf1may25 వెబ్‌సైటులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.ఆ రోజు ఉదయం 10 గంటలకల్లా హాజరు కావాలని, వివరాలకు 95332 21189 నెంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమం ఈ నెల 11వ తేదీ సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ అర్జీలను డివిజన్, మండల కేంద్రాల కార్యాలయాల్లోనే సమర్పించవచ్చన్నారు. జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగా అధికారులు సేవలు అందిస్తారన్నారు. ప్రజలు మీ కోసం 1100 కాల్ సెంటర్ ద్వారా కొత్త ఫిర్యాదులు నమోదు చేయడంతో పాటు ఇప్పటికే నమోదైన ఫిర్యాదుల పరిష్కారస్థితిని తెలుసుకోవచ్చన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా కూడా పౌర సేవలు పొందవచ్చన్నారు.

8

950 కేజీల రేషన్ బియ్యం పట్టివేత



బొమ్మూరు ఎస్పీ కార్యాలయ ఆవరణలో వాహనాలు

తహశీల్దార్ పాత జీపు

చెత్తగించవలెను!

ప్రభుత్వ ఆఫీసుల్లో కానరాని స్వచ్ఛభారత్

చెత్తగా ప్రభుత్వ కార్యాలయాలు..

వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో వాడకంలో లేని వాహనాలు, పనికిరాని ఫైళ్లు, విరిగిన చెక్క కుర్చీలు, టేబుళ్లు, ఇనుము సామగ్రి ఒక చోట పోగుగా వేసి వదిలేస్తున్నారు. దీనిని వదిలించుకోవాలనే మాత్రం ఆలోచన ఏ ఒక్కరూ చేయడం లేదు.అధిక శాతం ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ పరిస్థితి ఉంది. ఇక పాత వాహ నాల పరిస్థితి అయితే ప్రత్యేకంగా చెప్పనవ సరం లేదు. ఉదాహరణకు అర్బన్ తహశీల్దారు కార్యాలయం బయట పలు వాహనాలు తుప్పు పట్టి ఏళ్లుగా పడి ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రి, ఆర్డీవో కార్యాలయం తదితర చోట్ల ఇదే పరిస్థితి.

మాట్లాడితే స్వచ్ఛ భారత్ అంటున్నారు.. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండాలంటున్నారు అధికారులు..అయితే వారి చుట్టూ ఉన్న పరిసరాలను మాత్రం గాలికొదిలేస్తున్నారు.. జిల్లాలో ఏ రెవెన్యూ కార్యాలయం చూసినా.. ఏ పోలీస్ స్టేషన్ చూసినా.. ఏ ఆసుపత్రి చూసినా.. ఏ చిన్న ప్రభుత్వ కార్యాలయం చూసినా పాడైపోయిన వాహనాలు, విరిగిన కుర్చీలు, భారీగా పేరుకుపోయిన ఫైళ్లు దర్శనమిస్తున్నాయి.. అయినా ఏ ఒక్కరూ వాటిపై దృష్టి సారించడంలేదు.. అధికారులు ఇకనైనా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పనికిరాని చెత్తను తొలగించి స్వచ్ఛ భారత్ చేపట్టాల్సి ఉంది.

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంట గెలిచి రచ్చ గెలవాలనేది సామెత. స్వచ్ఛ భారత్ క్రతువులో ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల తీరు దానికి విభిన్నంగా గోచరిస్తున్నాయి. స్వచ్ఛభారత్ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్నాయి.అయితే ప్రభుత్వ కార్యాలయాలు,పోలీస్ స్టేషన్లలో పేరుకుపోయిన చెత్తను మాత్రం వదిలించుకోవడం లేదు. స్వచ్ఛ భారత్ అంటూ మైక్‌లలో ఊదరగొడుతున్న యంత్రాంగం.. పోలీస్ స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యర్థాల తొలగింపుపై మాత్రం దృష్టి సారించకపోవడంతో ఊరు ఊడుస్తూ ఇంట్లో చెత్త పెట్టుకున్నట్టుగా పరిస్థితి కనిపిస్తోంది.

పోలీస్ స్టేషన్ల చుట్టూ వాహనాలే..

పోలీస్ స్టేషన్లలోని వాహనాల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. తూర్పుగోదావరి జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లు ఉంటే ఏ స్టేషన్ వద్ద చూసినా సుమారుగా 400 పైనే ద్విచక్రవాహనాలు,కార్లు, లారీలు తుప్పు పట్టి దర్శనమిస్తాయి.అంటే ఒక్క జిల్లాలోనే 10 వేల వరకూ వాహనాలు మూల నపడి ఉన్నాయి. అందుకే ఏ పోలీస్ స్టేషన్‌లో చూసినా ఆవరణ నిండా ద్విచక్ర వాహనాలే దర్శనమిస్తాయి. సారా, గంజాయి, డ్రంకెన్ డ్రైవ్ తదితర కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహ నాలను తెచ్చి స్టేషన్లలో పడేస్తున్నారు. వాటిని విడిపించుకునే మార్గాలు యజమానులకు తెలియక వదిలేస్తున్నారు. దీంతో వాహనాలు తుప్పుపట్టిపోతున్నాయి.పలు స్టేషన్లలో స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి అసలు రికార్డు నిర్వహించడం లేదని తెలుస్తోంది. ఏళ్ల పాటు కేసులు నడిచి తీరా బండిని తీసుకొనే రోజు వచ్చేసరికి వాహన అస్థిపంజరం మాత్ర మే మిగులుతోంది. స్టేషన్లలో సేఫ్‌గా ఉండాల్సిన వాహనాల పార్టులు మాయమైపోతున్నాయి.



వాహనం సీజ్ చేస్తే ఏం చేయాలి..

ఏదైనా కేసులో వాహనం పట్టిబడినా.. రికార్డు లేదని పోలీసులు బైక్ సీజ్ చేసినా.. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినా.. ఆధార్‌కార్డు, బైక్ సీబుక్‌తో కోర్టును ఆశ్రయించాలి. చట్ట పరిధిమేరకు జరిమానా విధిస్తారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేల వరకూ జరిమానా విధిస్తారు. మిగిలిన కేసుల్లో అయితే సీరియస్‌నెస్‌ను బట్టి జరిమానా ఉంటుంది.

మట్టిలో కలిసిపోతున్నాయి..

వాస్తవానికి చట్టం ఉల్లంఘనలపై స్వాధీనం చేసుకున్న వాహనాల విషయంలో వివిధ వెసులుబాట్లు ఉన్నాయని న్యాయవాదులు చెబుతున్నారు.కానీ బండిని తీసుకొచ్చి స్టేషన్లలో పడేయడం.. ఆపై దానిని స్క్రాప్‌గా మార్చడం ఆనవాయితీగా మారిపోయింది.అసలు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలపై లెక్క పక్కాగా లేకపోవడం కొన్ని వాహనాలు మాయం కావడానికి ఆస్కారం కల్పిస్తోందనే విమర్శలున్నాయి. లక్షల రూపాయల విలువైన ద్విచక్ర వాహనాలు,కార్లు ఎండకు ఎండి వానకు తడు స్తున్నాయి.రాజమహేంద్రవరం,ధవళేశ్వరం,ఉండ్రాజవరం,బొమ్మూరు,రాజానగరం,కొవ్వూరు, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల పోలీస్‌స్టేషన్ల వద్ద వాహనాలు మట్టిలో కలిసిపోతున్నాయి.

- విరిగిన కుర్చీలు..
- పేరుకుపోయిన ఫైళ్లు
- తుప్పుపట్టిన వాహనాలు
- పోలీస్ స్టేషన్ల నిండా బైక్‌లు
- మట్టిలో కలిసిపోతున్న కార్లు
- అయినా పట్టని వైనం



టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో

ఇలా చేస్తే బెటర్ కదా..

పోలీస్ స్టేషన్లలో స్వాధీనం చేసుకున్న వాహనాల్లో అధికశాతం ద్విచక్ర వాహనాలే. వాహనం స్వాధీనం చేసుకున్న తర్వాత ఆ వాహనం ధర ను నిర్ధారించి ఆ సొమ్మును కోర్టులో లేదా స్టేషన్లలో డిపాజిట్ చేయించుకుని సదరు వాహనాన్ని యజమానికి అప్పగిస్తే మేలు జరుగుతుంది.ఎవరూ క్లెయిమ్ చేయని వాహనాలను సాధ్యమైనంత త్వరగా చట్టాన్ని అనుసరించి వదిలించుకోవచ్చు. వేలం వేయడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. వాహ నాలు ధ్వంసమయ్యే వరకూ మురగబెట్టి వేలం వేయడం వల్ల భారీ నష్టం కలుగుతోంది. రెండు నెలల కిందట జిల్లాలోని ఎక్సయిజ్ శాఖ పరిధిలో సుమారు 20 వాహనాలు వేలం వేశారు. 20 వాహనాలకు కేవలం రూ.40 వేల వరకూ వచ్చినట్టు సమాచారం. అంటే అందులో ఒక్క వాహనం ఖరీదు కూడా లేదనేది పోలీసెరిగిన వాస్తవం.. అయినా మార్పు కానరావడంలేదు.

పరీక్షలకో పుస్తకం!



దివాన్‌చెరువు, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు తమకు నిర్వహించే పరీక్షలను రాసేందుకు ప్రభుత్వం మూల్యాంకన పుస్తకాలను సరఫరా చేసింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిర్వహించే నాలుగు ఫార్మేటివ్ అసెస్మెంట్, రెండు సమ్మెటివ్ పరీక్షలతో పాటు విద్యాసంవత్సరం చివరిలో నిర్వహించే పరీక్షలు ఈ పుస్తకాల్లోనే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. గతంలో ప్రశ్నపత్రాలను అధికారులు సరఫరాచేస్తే ఆయా పాఠశాలలు తెల్ల కాగితాలను కొని వాటిపై సంబంధిత పాఠశాల స్టాంప్‌లు వేసి ఉపాధ్యాయులు పరీక్షలు నిర్వహించేవారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి ఈ విధానంలో మార్పు తెచ్చారు. విద్యాశాఖ సరఫరా చేసిన మూల్యాంకన పుస్తకాల్లో ప్రశ్నలవారీ జవాబులు రాసేందుకు తగినంత ఖాళీ ఉంచారు. 10 మార్కులు, 5 మార్కులు, రెండు మార్కుల వారీ జవాబులకు సరిపడే ఖాళీని అందులో ఉంచారు. మూల్యాంకన పుస్తకాలు ఆయా పాఠశాలలకు చేర్చారు. 1 నుంచి 10 తరగతుల వరకూ విద్యార్థులకు సోమవారం నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు జరుగుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

98 వేల క్యూసెక్కులు సముద్రంపాలు

ధవళేశ్వరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ఆదివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ నుంచి 98,476 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పుడెల్టాకు 4700 క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టా 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7వేల క్యూసెక్కులు చొప్పున 14,400 క్యూసెక్కులు కాల్వలకు విడుదల చేశారు.



హౌ..ష్!

పేదల కొంప ముంచిన వైసీపీ

స్పందించని కేంద్రం



లబ్ధిదారుల జాబితాను కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లో పట్టణం, గ్రామీణ ప్రాం తం విభాగంలో అప్‌లోడ్ చేయాలి. లబ్ధిదారుడి ఫొటోలతో సహా అప్‌లోడ్ చేస్తే అర్హత సాధించిన ఒక్కో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి కేంద్రం రూ.1.50 లక్షలు,రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేయాలి. ఇక్కడే అసలు చిక్కు మొదలైంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఇవ్వడానికి ఏ ఇబ్బందీ లేకపోయినా కేంద్రం నుంచే సమస్య తలెత్తింది. ఉమ్మడి జిల్లాలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలు అధికారులు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఇలా చేయాలంటే గ్రామాల వారీగా ప్రత్యేకంగా కేటాయించిన లాగిన్‌లను ఉపయోగించి పథకానికి అర్హత సాధించిన వారి వివరాలు అప్‌లోడ్ చేస్తారు. కానీ ఇప్పటి వరకు కేంద్రం అసలు లాగిన్‌లే ఇవ్వలేదు.దీంతో ఎంపికైన లబ్ధిదారుల వివరాలు జిల్లా అధికారుల వద్దే ఉండిపోయాయి.కాకినాడ జిల్లాలో 326 గ్రామాలకు లాగిన్లు ఇవ్వాల్సి ఉంటే ఇప్పటి వరకు 106 గ్రామాలకే లాగిన్‌లు ఇచ్చారు.వీటి ద్వారా లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తే కేవలం 1800 దరఖాస్తులు మాత్రమే కేంద్ర వెబ్‌సైట్ స్వీకరించింది. కోనసీమ జిల్లాలో 286 గ్రామాలకు 47 గ్రామాలకే లాగిన్‌లు ఇవ్వగా దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తుంటే స్వీకరించడం లేదు. తూర్పుగోదావరి జిల్లాలో 303 గ్రామాలు ఉంటే 55 గ్రామాలకు కూడా లాగిన్‌లు కేటాయించలేదు. దీంతో లబ్ధి దారులకు ఇప్పట్లో కేంద్రం నుంచి ఇళ్ల నిర్మాణ అనుమతులు వచ్చేలా కనిపించడం లేదు.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో పేదల సొంతింటి కల సాకారం అవడం లేదు. దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా అనుమతులు రావడం లేదు. ఒక పక్క వీరి అర్హతను ధ్రువీకరిస్తూ గృహ నిర్మాణ శాఖ పచ్చజెండా ఊపినా కేంద్రం అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసినా వెబ్‌సైట్‌లో నమోదు చేయడానికి కేంద్రం కావాల్సిన లాగిన్‌లు పూర్తిగా ఇవ్వడం లేదు. దీంతో సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకోవాలనుకునే పేదలకు ప్రభుత్వ సాయం ఎప్పుడు అందుతుందో స్పష్టత లేదు. అధికారులేమో అర్హులైన లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తున్నా కేంద్రం ఆమోదం లేక తిరస్కారానికి గురవుతున్నాయి.గత వైసీపీ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో ఎడాపెడా లెక్కలు చూపడంతో అనుమానాలతో తాజా లబ్ధిదారులను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడానికి సాంకేతిక ఇబ్బందులు అడ్డువస్తున్నాయని చెబుతున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో 44,700 మంది పేదలు దీనంగా ఎదురుచూస్తున్నారు. కొందరైతే నిధులు విడుదల ఖాయమని భావించి పనులు చేసేసి బిల్లులు అందక లబోదిబోమంటున్నారు.

44,700 దరఖాస్తులు..

పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సాయం ప్రకటించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సొంత స్థలం ఉన్న పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామన్న హామీని నెరవేర్చ డానికి దరఖాస్తులు స్వీకరించింది. ఈ మేరకు కేంద్రం,రాష్ట్రం కలిపి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రకటించింది.ఈ మేరకు సచివా లయాల ద్వారా గతేడాది నవంబరు ఆఖరు నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 44,700 మం ది దరఖాస్తులు చేసుకున్నారు.అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18,500 దరఖాస్తులు, తూర్పుగోదావరి జిల్లాలో 12,200, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 14 వేల దరఖాస్తులు వెల్లువెత్తాయి. జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు అర్హుల కోసం గ్రామాల వారీగా డిమాండ్ సర్వే నిర్వహించగా 95 శాతం మందికిపైగా అర్హత సాధించారు. వివిధ దశల వడపోత అనంతరం రాష్ట్ర ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖ లబ్ధిదారుల యాప్‌లో వివరాలు నమోదు చేశారు.



గాలి లెక్కలతో అస్తవ్యస్తం

కేంద్రం పీఎం అవాస్ యోజన 2.0 కింద ఉమ్మడి జిల్లాలో సొంత స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి. కేంద్రం లాగిన్‌లలో లబ్ధిదారుల వివరాలు అప్‌లోడ్ చేస్తేనే ఇది సాధ్యం. కేంద్రం లాగిన్‌లు ఇవ్వకపోవడానికి గత వైసీపీ హయాంలో జరిగిన అడ్డదిడ్డ నిర్ణయాలే కారణమని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో గొప్పల కోసం కట్టని ఇళ్లను సైతం జగనన్న ఇళ్ల కాలనీల పేరుతో కేంద్రానికి దొంగ లెక్కలు చూపించేశారు. తద్వారా నిధులు రాబట్టేశారు.ఎక్కడో ఊరి చివర, శ్మశానాల వద్ద ఖాళీ స్థలాల్లో పేదలకు భూములిచ్చారు. ఇవన్నీ ముంపు ప్రాంతాలు, ఊళ్లకు దూరంగా ఉండడంతో లబ్ధిదారులు అసలు ఇళ్లు కట్టలేదు. ఇవి పూర్తకపోవడంతో కేంద్రం సీరియస్‌గా ఉంది.ఈ నేపథ్యంలో తాజా లబ్ధిదారులకు చిక్కులు తలెత్తాయి. పాతవి పూర్తికాకపోవడం,నిధులు లాగేయడంతో ఇప్పుడు కేంద్రం కొత్త లబ్ధిదారులను పరిగణనలోకి తీసుకోకుండా లాగిన్‌లు ఇవ్వడం మానేసింది. అప్పటి జగన్ ప్రభుత్వ నిర్వాకం ఇప్పుడు అసలు సిసలు పేదల కొంపముంచింది. డిమాండ్ సర్వే పూర్తవడంతో పథకానికి అర్హత వచ్చేసిందన్న ధీమాతో ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం అనేకమంది పేదలు పునాదులు,శ్లాబ్‌స్థాయి వరకు నిర్మాణాలు చేసేశారు.తీరా బిల్లులు కాదుకదా..కేంద్రం లాగిన్‌లు ఇవ్వకపోవడంతో తలలుపట్టుకుంటున్నారు.

- పీఎంఏవైకు ఎదురుచూపులు
- దరఖాస్తులు చేసి 8 నెలలు
- ఇంకనూ రాని అనుమతులు
- 44,700 మంది దరఖాస్తు
- గృహనిర్మాణ శాఖ సర్వే పూర్తి
- 95 శాతం అర్హులుగా గుర్తింపు
- నమోదు కాని వివరాలు
- లాగిన్‌లు కేటాయించని కేంద్రం



నిమ్మ రైతు..కంటి చెమ్మ!

- అమాంతం పడిపోయిన మార్కెట్
- కేజీ రూ.20 నుంచి రూ.25
- గిట్టుబాటు కాక ఆందోళన
- లబోదిబోమంటున్న రైతులు

గోపాలపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక నిమ్మరైతుల కళ్లు చెమ్మగిల్లుతున్నాయి. పెట్టుబడితో పాటు శ్రమకు తగిన ఫలితం లేకపోవడంతో నిమ్మకాయలు చెట్ల నుంచి కోయడానికి కూడా రైతు అడుగు ముందుకు వెయలేకపోతున్నాడు. ఆశించిన ధర దక్కకపోవడానికి ధరలు తగ్గుదలే ప్రధాన కారణమని నిమ్మరైతులు చెబుతున్నారు. ఏళ్ల కొద్దీ తోటలు పెంచి పూతసమయంలో వర్షాలు కురవడం, పూత రాలిపోవడం వంటి పరిణామాలు నిమ్మ రైతులపై ప్రభావం చూపుతున్నాయి. వేసవిలో ధరలు గరిష్ఠంగా పెరగడంతో దిగుబడి లేక రైతులు ఆశించిన స్థాయిలో నిమ్మకాయలు ఉత్పత్తి చేయలేకపోయారు. ప్రస్తుతం దిగుబడి అధికంగా ఉన్నప్పటికి ధరలు పడిపోవడంతో నిమ్మరైతుకు అనాసక్తి కలుగుతుంది. ఈ ఏడాది వేసవిలో కిలో నిమ్మ ధర గరిష్ఠంగా రూ.70 - రూ.80ల వరకు పెరిగింది. రైతుకు ఆశించిన స్థాయిలో ధర ఉన్నప్పటికి ఉత్పత్తి, దిగుబడి లేకపోవడంతో డీలా పడ్డారు. ప్రస్తుతం దిగుబడి ఉన్నా ధరలు పతనం కావడంతో కిలో నిమ్మ ధర రూ.25 -20 పలుకుతోంది. కిలోకు చిన్న సైజు అయితే 25 కాయలు వస్తాయి.. పెద్ద సైజు అయితే 18 కాయలు వరకూ వస్తాయి. దీంతో దిగుబడి ఉన్న ఫలితం దక్కడం లేదంటూ నిమ్మరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిమ్మపై పొగాకు ప్రభావం

ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో పొగాకు, నిమ్మ సాగుపై ప్రభావం చూపుతుంది. దీంతో ఆశించిన స్థాయిలో పెట్టుబడికి దగ్గ ఫలితం లేకపోవడంతో నిమ్మ రైతులు పొగాకు సాగుపై మక్కువ చూపుతున్నారు. గత మూడేళ్లగా పొగాకు ధరలు గరిష్ఠంగా పెరగడంతో నిమ్మను తొలగించి పొగాకు సాగుపై నిమ్మరైతులు సాగుకు మక్కువ చూపుతున్నారు. కాస్తో కూస్తో మిగిలిన నిమ్మ రైతులకు కనీస ధరలు దక్కకపోవడంతో నిరాశచెందుతున్నారు. నిమ్మ ధరలు ఇలాగే ఉంటే రానున్న రోజుల్లో నిమ్మ సాగు కనుమరుగయ్యే పరిస్థితి ఉంటుంది.

కూలీల ఖర్చులు రావడంలేదు



రెండెకరాల నిమ్మతోటలో కాయలు కోసి మార్కెట్‌కు తీసుకెళితే కనీసం కూలీల ఖర్చుకు రావడం లేదు. దీంతో నిమ్మకాయలు కొయ్యకుండా తోటలోనే వదిలేశాం. ప్రభుత్వం నిమ్మసాగు రైతులకు మద్దతు ధర ప్రకటిస్తే రైతులు గట్టెక్కుతారు.

- వి.కృష్ణమూర్తి, రైతు, కరిచర్లగూడెం

సాగుపై మక్కువపోయింది



గత దశాబ్ద కాలంగా నిమ్మ సాగు చేస్తున్నా. అధిక లాభాలు చూసిన రోజులు ఉన్నాయి. ప్రస్తుత నిమ్మ మార్కెట్ అందుకు భిన్నంగా ఉంది. ఎంత శ్రమ పడినా ఫలితం లేక నిమ్మసాగుపై ఉన్న మక్కువ పోయింది. ఈ - మార్కెట్ ఏర్పాటు చేయాలి.

-కాశిం సాహెబ్, రైతు, కొవ్వూరుపాడు

ఘనంగా సుబ్బరాయచౌదరి జన్మదిన వేడుకలు



వృద్ధాశ్రమంలో నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ రాజమహేంద్రవరం కార్యాలయ కార్యదర్శి పొట్టు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి. దీనికి కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెనుమాక జయరాజు హాజరై మాట్లాడుతూ దాతృత్వం చాటుకోవడంలో ప్రప్రథమంగా నిలిచే వ్యక్తి సుబ్బరాయచౌదరి అని కొనియాడారు. ఈ సందర్భంగా సత్యవతినగర్‌లోని అంధుల ఆశ్రమంలో కేకు కట్ చేసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు బియ్యం, నిత్యవసరాలు పంపిణీ చేశారు. శ్రీసత్యసాయి నిత్యాన్నపూర్ణ పథకంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులు, సహాయకులకు అన్నదానం చేశారు. బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మద్దుకూరి సురేష్, మాదిరెడ్డి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'పార్టీని బలోపేతం చేయాలి'

కొవ్వూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పార్టీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పిలుపునిచ్చారు. కొవ్వూరు నియోజకవర్గ బీజేపీ పదాధికారుల ముఖ్య నాయకుల సమావేశం ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాగేంద్ర మాట్లాడుతూ కూటమి ధర్మాన్ని పాటిస్తూ, బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పట్టణ పురవీధుల్లో జాతీయ పతాకాలు చేతపట్టి తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కోడూరి లక్ష్మీనారాయణ, బోడపాటి ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, బూసి బెనర్జి, ముప్పరాజు శ్రీనివాస్, మాట్ల అంజనేయులు, దేగల సునీత, రామకృష్ణ, టీవీ భాస్కర్, తాళ్లూరి ప్రసాద్, పీ. నాగమణి, నామా రంగయ్య, సత్యనారాయణ, ఉప్పులూరి ప్రసాద్, బాలకృష్ణ, రాజేష్, రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

'మండల' సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు వీరే...

ఉండ్రాజవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండల సొసైటీల త్రిసభ్య కమిటీలకు చైర్‌పర్సన్లు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. మొత్తం 10 సొసైటీలకు కమిటీలను నియమించింది. ఉండ్రాజవరం సొసైటీ చైర్‌పర్సన్‌గా గన్నమని రామకృష్ణ, సభ్యులుగా పిల్లి సత్యనారాయణ, వీఎస్‌వీ సత్యనారాయణ, పాలంగి సొసైటీ చైర్‌పర్సన్‌గా కాకర్ల నరసన్న, సభ్యులుగా వడ్డి దుర్గాప్రసాద్, కొడమంచిలి ఏసోబు, కాల్ధరి సొసైటీ చైర్‌పర్సన్‌గా కోమట్లపల్లి రామదాసు, సభ్యులుగా కట్టా సుధీర్‌కుమార్, అమిరిశెట్టి నరసింహారావు, మోర్త సొసైటీ చైర్‌పర్సన్‌గా కరుటూరి వెంకటదొర ప్రసాద్, సభ్యులుగా చిటికిన కృష్ణ, మడిచర్ల సురేంద్రరావు, సూర్యారావుపాలెం సొసైటీ చైర్‌పర్సన్‌గా ఆచంట సాయిరామ్, సభ్యులు తాలాభత్తుల వెంకటేశ్వరరావు, మొగలపు అమ్మన్నచౌదరి, తాడిపర్రు సొసైటీ చైర్‌పర్సన్‌గా దుర్గా బాలకృష్ణ, సభ్యులుగా ఎంవీఎన్ సత్యనారాయణ, ఉర్రింకల సత్యనారాయణ, వద్దూరు సొసైటీ చైర్‌పర్సన్‌గా వేములమంద వెంకటసీతారామరాజు, సభ్యులుగా చెల్లింకి త్రిమూర్తులు, లంకా వెంకటేష్, సత్యవాడ సొసైటీ చైర్‌పర్సన్‌గా అనపర్తి సత్యనారాయణ, సభ్యులుగా వీ. వెంకటేష్, ఎస్.బంగార్రాజు, వేలివెన్ను సొసైటీ చైర్‌పర్సన్‌గా చిట్టూరి సూర్యనారాయణ, సభ్యులుగా అట్లూరి రామకృష్ణ, పెన్నేటి రామకృష్ణ, చివటం సొసైటీ చైర్‌పర్సన్‌గా ఎంసీవీపీ రంగారావు, సభ్యులుగా ఎంవీవీ సత్యనారాయణ ఎంపికయ్యారు. పలువురు అభినందించారు.

'దేశభక్తిని పెంపొందించాలి'



తిరంగా ర్యాలీలో ఎంపీడీవో రాజమనోహర్, సచివాలయ సిబ్బంది

గోపాలపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచే దేశభక్తిని పెంపొందించాలని ఎంపీడీవో జీ.రాజమనోహర్ అన్నారు. ఆజాదిక అమృత్ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో ఆదివారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ మాతాకీ జై అంటూ జాతీయ జెండాలతో అధికారులు ఎంపీడీవో కార్యాలయం నుంచి చెక్‌పోస్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాల్యం నుంచే చిన్నారుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించాలన్నారు. సామాజిక స్పృహతో పాటు సేవా దృక్పదాన్ని అలవరిచి ననాడే దేశం పట్ల జాతీయతాభావం పెరుగుతుందన్నారు. జాతీయ గీతాలపన నేర్పించటం ద్వారా విద్యార్థి దశలో దేశం కోసం పోరాడేతత్వం అలవడుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఉండ్రాజవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం బాలబాలికలకు మాత్రల పంపిణీకి ఏర్పాటు పూర్తి చేసినట్టు డాక్టర్ బీ. దుర్గామహేశ్వరరావు తెలిపారు. మండలంలో 5,515 మంది విద్యార్థులకు వేయాల్సి ఉందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా వేయించుకునేందుకు సహకరించాలని ఆయన కోరారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



నిడదవోలులో మానవహారంగా ఏర్పడిన మునిసిపల్ అధికారులు, కూటమి నేతలు



తాళ్లపూడిలో...



దేవరపల్లిలో ర్యాలీ చేస్తున్న అధికారులు

నిడదవోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద 79వ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి అనంతరం పట్టణంలో ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ తోట కృష్ణవేణి, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, కారింకి నాగేశ్వరరావు, కూటమి నాయకులు, మునిసిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండల కేంద్రమైన తాళ్లపూడిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ లక్ష్మీలావణ్య ఆధ్వర్యంలో ఆదివారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఒక పండుగలా జరుపుకోవాలన్నారు. అలాగే ప్రజలంతా తమ ఇంటిపై మూడురంగుల జెండాను ఎగురవేయాలని కోరారు. అనంతరం మెయిన్ రోడ్డులో జరిగిన ర్యాలీలో 100 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ట్రైనీ ఎస్ఐ ఆదిత్య శ్రీనివాస్, ఆర్ఐ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆటో డ్రైవర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో ఆదివారం హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్టాండ్ నుంచి గోపాలపురం మూడురోడ్ల సెంటర్ వరకు జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీనివాస్, ఎంపీడీవో ఎంపీడీవో వై.రాజారావు, ఎంఈవో తిరుమలదాసు, పంచాయతీ కార్యదర్శి ఎన్.రవికిశోర్, మండల పరిషత్, రెవిన్యూ అధికారులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) :తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మ వారి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అప్పారావు శర్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభించి, ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనా మ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహానివేదన చేశారు. అనంతరం ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు ఉచిత, ప్రత్యేక దర్శనాల ద్వారా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులు అమ్మవారిని పెద్దఎత్తున దర్శించుకున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



శవాన్ని అంత్యక్రియలకు తీసుకువెళుతున్న సేవా సంస్థ సభ్యులు, తదితరులు

తాళ్లపూడి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అనాథ శవానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. తాళ్లపూడిలో బిచ్చమెత్తుకుని జీవిస్తూ ఉన్న లక్ష్మి ఆదివారం మృతిచెందింది. గ్రామస్థులు ఈవిషయాన్ని రెవెన్యూ సిబ్బంది, పోలీసులకు చేరవేశారు. సమాచారం తెలుసుకున్న మానవత సంస్థ మాజీ అధ్యక్షుడు, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంస్థ సభ్యులతో కలిసి లక్ష్మి మృత దేహానికి అంత్యక్రియలు చేపట్టారు. సనపల రాజశేఖర్, పెమ్మాడి దుర్గాప్రసాద్, అప్పన గుప్త అందించిన సేవలపై గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఊనగట్ల 'సొసైటీ' అధ్యక్షుడిగా నాగేంద్ర



సభ్యులను అభినందిస్తున్న మాజీ ఏఎంసీ చైర్మన్ హరిబాబు, తదితరులు

చాగల్లు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఊనగట్ల సహకార సంఘ సొసైటీ అధ్యక్షుడిగా బొల్లిన శివ నాగేంద్ర నియమితులయ్యారు. ఈయన యువ నాయకుడిగా పార్టీ కోసం పనిచేస్తూ గుర్తింపు పొందారు. అలాగే సభ్యులుగా మిరియాల సతీష్, దొంగ లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. తీవ్రమైన పోటీ నెలకొనడంతో మొదటి దఫా జాబితాలో ప్రకటించకపోయినప్పటికీ ఎట్టకేలకు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన సభ్యులను మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి అభినందించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ జాతీయభావం అవసరం : ఎమ్మెల్యే



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి , ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్

కొవ్వూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి ఒక్కరికీ జాతీయభావం అవసరమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం కొవ్వూరు మున్సిపాల్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి విజయవిహార్ సెంటర్ వరకు జాతీయ జెండాలు చేతపట్టి, నినాదాలు చేస్తూ తిరంగా ర్యాలీ నిర్వహించారు. దీన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ భావాన్ని భావిభారత పౌరులలో పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రదాని మోదీ పిలుపుమేరకు ఈనెల రెండో తేదీ నుంచి 15 వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి మాట్లాడుతూ జాతీయ జెండాలోని మూడు రంగుల విశిష్ఠత గురించి వివరించారు. ఆర్డీవో రాణీసుస్మిత మాట్లాడుతూ జాతీయ జెండా విశిష్ఠత, ఫ్లాగ్ హోస్టింగ్ ప్రక్రియపై అవగాహనా కల్పించారు.

కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మున్సిపల్ కమిషనర్ జీ.సందీప్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో వీవీఎస్ చౌదరి, ఏఈ సుమంత్, మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కడియం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): విలువలే ప్రధాన ధ్యేయంగా ఉద్యమ స్ఫూర్తితో ఏర్పడిన సంఘం యూటీఎఫ్ అని ఆ సంఘ జిల్లా కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. కడియంలో ఆదివారం యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ. అబ్బాయి, వీ. శాస్త్రి అధ్యక్షతన జరిగాయి. ఉపాధ్యాయ నేత సీనియర్ కామ్రేడ్ ఆర్‌వీ రమణ పాల్గొని యూటీఎఫ్ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కార్యదర్శి చిలుకూరి శ్రీనివాసరావు, యూటీఎఫ్ శ్రేణులు గోపాలకృష్ణ, పి నాగేశ్వరరావు, దొరబాబు, ఆనంద విజయకుమార్, ఆకుల వీర్రాజు, ఉంగరాల వీరభద్రరావు, సందీప్, అమ్మాజీ, చోడిశెట్టి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉమాచోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



స్వామివారికి బిల్వార్చన నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతవూరులో వేంచేసియున్న ఉమా చోడేశ్వరస్వామికి ఆదివారం లక్షబిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు కౌతవరపు భాను, దేవరకొండ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరానికి చెందిన ఏలూరిపాటి సత్యశ్రీకృష్ణ, సుబ్బలక్ష్మి పీఠాలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతిపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో మేడూరి ప్రసాదరావు, నూతలపాటి శివప్రసాద్, కలిగొట్ల కృష్ణారావు, చిట్టా భాస్కరం, వెలమకన్ను రామబ్రహ్మం, ముష్టి శ్రీరామచంద్రమూర్తి, తెన్నేటి సూర్యనారాయణ, బాలప్ప రాంప్రసాద్, చట్టి వెంకటరమణారావు, దామరాజు సచ్చిదానంద, గంగాధరభట్ల శ్రీరామచంద్రమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గోకవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన 950 కేజీల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి కొత్తపల్లి, కామరాజుపేటలో ఏఎస్‌వో నాగాంజనేయులు, ఎంఎస్‌వో శాంతిప్రియ తనిఖీలు నిర్వహించారు.

ధనలక్ష్మి అమ్మవారి ఊరేగింపు

చాగల్లు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చాగల్లు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలోని ధనలక్ష్మి అమ్మవారి ఆలయంలో శ్రావణమాస మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం ఆలయంలో స్వామివారి దివ్య కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం విగ్రహాలను గ్రామ పురవీధుల్లో వేడుకగా ఊరేగించారు. యువత మేళతాళాలు, విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలతో రథోత్సవ ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. ఆలయ ధర్మకర్తలు కారుమూరి గున్నేశ్వరరావు గుప్త వెంకటలక్ష్మి దంపతులు, పురజనులు, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

కొవ్వూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : భార్యతో ఘర్షణ పడి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వ్యక్తి గోదావరిలో శవమై తేలాడు. దీనికి సంబంధించి ఆదివారం కొవ్వూరు రూరల్ ఎస్ఐ కే.శ్రీహరిరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన కోరశిఖ సత్యనారాయణ (43) ఈనెల 8వ తేదీ రాత్రి భార్యతో ఘర్షణపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఎంత వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయన కుమారుడు కోరశిఖ లక్ష్మీనారాయణ తొమ్మిదో తేదీన రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా, ఆదివారం వాడపల్లి ఇసుకర్యాంపు సమీపంలో మగ మృతదేహం తేలి ఉందని సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లి చూశారు. దీనిపై బంధువులకు సమాచారం అందించగా వారు వచ్చి చూసి సత్యనారాయణదిగా గుర్తించారు. స్థానిక జాలర్ల సహాయంతో మృతదేహాన్ని నది నుంచి బయటకు తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పార్టీ కోసం పని చేస్తే గుర్తింపు, గౌరవం

● గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



గోపాలపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం పని చేసే వారికి తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని 17 సహకార సొసైటీలకు సంబంధించి చైర్మన్లు, డైరెక్టర్ల నియామకానికి సంబంధించిన జాబితాను ప్రకటన రూపంలో విడుదల చేశారు. ఎన్నికైన సొసైటీ చైర్మన్లు వీరే... గోపాలపురం చైర్మన్‌గా వడ్లమూడి రమేశ్, డైరెక్టర్లు ముత్యాల రాయుడు, ప్రగడ రాంబాబు, చెరుకుమిల్లి సొసైటీ చైర్మన్‌గా గద్దే హరిబాబు, డైరెక్టర్లుగా గర్శికూటి సత్యనారా యణ, పడగాల నరసింహమూర్తి, గౌరీపట్నం సొసైటీ చైర్మన్‌గా ఆండ్రూ అనీల్, డైరెక్టర్లు ఏ.నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, చిన్నాయిగూడెం చైర్మన్ గన్నమనేని గోపాలకృష్ణ, డైరెక్టర్లు గోవిందరాజు, అనిశెట్టి గంగ రాజు, దేవరపల్లి సొసైటీ చైర్మన్‌గా ఉప్పులూరి రామారావు, డైరెక్టర్ శ్రీనివాస్, కవల సీతా రత్నకుమారి, యర్నగూడెం పెనుమత్స హేమ కుసుమ సుబ్బరాజు, డైరెక్టర్లు యండ్రప్రగడ శ్రీధర్, పుట్టా హరిప్రసాద్, త్యాజంపూడి సొసైటీ చైర్మన్‌గా కొడూరి వీరవెంకట రత్నం, డైరెక్టర్లు చిటికన రామకృష్ణ, శ్రీనివాస్, పోతవరం సొసైటీ చైర్మన్‌గా పసుమర్తి ప్రభాకరరావు, డైరెక్టర్లు గొంతియ్య, శేషారత్నం, సొసైటీ చైర్మన్‌గా దుద్దుకూరు కరుటూరి శ్రీరామ్మూర్తి, డైరెక్టర్లు రంగారావు, గంగరాజు, నల్లజర్ల సొసైటీ చైర్మన్‌గా రావూరి వెంకట రమణ, డైరెక్టర్లను నియమించాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

నిడదవోలు మండల 'సొసైటీల' నూతన కార్యవర్గాలు

నిడదవోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల సహకార సొసైటీలకు నూతన కార్యవర్గాలను నియమించారు. ఇందులో శెట్టిపేట సొసైటీ అధ్యక్షుడిగా పాటంశెట్టి శివన్నారాయణ, సభ్యులుగా కే.చినబాబు, బయ్యే కిరణ్‌కుమార్, శింగవరం సొసైటీ అధ్యక్షుడిగా పెన్మత్స చందు, సభ్యులుగా ఎస్.దుర్గాప్రసాద్, కట్టా కృష్ణ, తాడిమళ్ల సొసైటీ అధ్యక్షుడిగా చింతల సర్వేశ్వరరావు, సభ్యులుగా పీ.సత్యనారాయణ, ఆర్. వెంకటేశ్వరరావు, కోరుమామిడి సొసైటీ అధ్యక్షుడిగా మట్టపర్తి చంద్రరావు, సభ్యులుగా ఎస్.వెంకట అప్పారావు, యు.గోపాలకృష్ణ, కాటకూటేశ్వరం సొసైటీ అధ్యక్షుడిగా కే.వెంకట సుబ్బారావు, సభ్యులుగా కే.పద్మావతి, పీ.రామారావు, పురుషోత్తపల్లి సొసైటీ అధ్యక్షుడిగా జుజ్జవరపు గోపాలకృష్ణ, సభ్యులుగా ఎస్.సూర్య ప్రభాకరరావు, ఎం.శ్రీనివాసరావు, పందలపర్రు సొసైటీ అధ్యక్షుడిగా ఏ.వెంకట సూర్య నాగమోహనరావు, సభ్యులుగా వీ.సూర్యనారాయణ, వీ.రామకృష్ణ, డి.ముప్పవరం సొసైటీ అధ్యక్షుడిగా ఎం.పూర్ణచంద్రరావు, సభ్యులుగా ఎం.సత్యనారాయణ, ఏ.సైదుబాబు, సమిశ్రగూడెం సొసైటీ అధ్యక్షుడిగా ఉప్పులూరి రామ్మోహనరావు, సభ్యులుగా పీ.వెంకటరావు, జీ.లక్ష్మయ్య చౌదరి, కోరుపల్లి సొసైటీ అధ్యక్షుడిగా కారింకి రామకృష్ణ వరప్రసాద్, సభ్యులుగా ఆర్. వెంకటేశ్వరరావు, జీ.శ్రీనివాసరావు, పెండ్యాల సొసైటీ అధ్యక్షుడిగా వాకా సురేష్, సభ్యులుగా ఇ.వీర వెంకట సత్యనారాయణ, వై.శేఖర్, శంకరాపురం సొసైటీ అధ్యక్షుడిగా పోలనాటి లీలాభాస్కర్లు, సభ్యులుగా పీ.బ్రహ్మాజీ, జీ.శ్రీధర్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మండల 'సొసైటీ' చైర్‌పర్సన్లు వీరే...



గౌరీపట్నం చైర్‌పర్సన్ అనిల్



దేవరపల్లి చైర్‌పర్సన్ రాంబాబు



దుద్దుకూరు చైర్‌పర్సన్ శ్రీరామ్మూర్తి



యర్నగూడెం చైర్‌పర్సన్ సుబ్బరాజు



త్యాజంపూడి చైర్‌పర్సన్ వెంకటరత్నం



చిన్నాయిగూడెం చైర్‌పర్సన్ గోపాలకృష్ణ

దేవరపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలంలో ఆరు వ్యవసాయ ప్రాథమిక, సహకార పరపతి సంఘాలకు సొసైటీ చైర్‌పర్సన్‌లు, సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గౌరీపట్నం సొసైటీ చైర్‌పర్సన్‌గా ఆండ్రూ అనీల్, సభ్యులుగా అట్టాడ నాగేశ్వరరావు, గుత్తికొండ శ్రీనివాసరావు, దేవరపల్లి సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రాంబాబు, సభ్యులుగా తంగెళ్ల శ్రీనివాస్, కవల సీతారత్న సూర్య కుమారి, దుద్దుకూరు సొసైటీ చైర్‌పర్సన్ కరుటూరి శ్రీరామమూర్తి, సభ్యులుగా కాట్రు రంగారావు, పెనుబోతుల గంగరాజు, యర్నగూ డెం సొసైటీ చైర్‌పర్సన్ పెనుమత్స సుబ్బరాజు, సభ్యులుగా యండ్రప్రగడ శ్రీధర్, పుట్టా హరిప్రసాద్, త్యాజంపూడి సొసైటీ చైర్‌పర్సన్ కొడూరి వెంకటరత్నం, సభ్యులుగా చిటికన రామకృష్ణ, దావాల శ్రీనివాస్, చిన్నాయిగూడెం సొసైటీ చైర్‌పర్సన్ గన్నమని గోపాలకృష్ణ సభ్యులుగా ఎస్.గోవిందరాజు, అనిశెట్టి గంగరాజులు నియమితులయ్యారు. చైర్‌ప ర్సన్‌లు, సభ్యులను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అభినందించారు. ఈ సొసైటీల చైర్‌పర్సన్‌లుగా నియమించటం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యే మద్దిపాటి కృతజ్ఞతలు తెలిపారు.